క్లుప్తంగా

సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: పట్టణంలోని హనుమాన్ నగర్ కాంప్లెక్స్ పరిధిలో బదిలీ అయిన ఉపాధ్యాయులు వెంకటన్న, ఫాతిమా, నసీమున్నీసా, కృష్ణ వేణమ్మను గురువారం ఘనంగా సన్మానించారు. కాంప్లెక్స్ చైర్మన్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి



వృద్ధాశ్రమానికి వంట పాత్రలు, గ్యాస్ స్టవ్ అందజేస్తున్న సబ్ రిజిస్ట్రార్ అబ్దుల్ కరీం

బేతంచెర్ల: సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సబ్ రిజిస్ట్రార్ అబ్దుల్ కరీం పిలుపునిచ్చారు. పట్టణంలోని మిస్పా వృద్ధాశ్రమానికి ఆయన వంట సామాగ్రి, గ్యాస్ స్టవ్, అన్న పూర్ణ అనాథ ఆశ్రమం చిన్నారులకు పుస్తకాలు అందజేశారు. అదే విధంగా అన్నదానం చేసిన సబ్ రిజిస్ట్రార్ పేదల అభివృద్ధికి స్థిరపడినవారు చేయూత నివ్వాలని సూచించారు.

లారీ డ్రైవర్ల జీతభత్యాల చర్చలు సఫలం

బేతంచెర్ల: లారీ డ్రైవర్లు, క్లీనర్ల జీత భత్యాల చర్యలు సఫలం అయినట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు తెలిపారు. గురువారం స్థానిక లారీవర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, సీఐటీయూ నాయకులు ఎల్లయ్య, శ్రీనివాసులు, రామక్రిష్ణ ఆధ్వర్యంలో లారీ డ్రైవర్లు, క్లీనర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగునంగా జీత, భత్యాలు పెంచాలని లారీ ఓనర్ వెల్ఫేర్ అసోషియేషన్‌కు లిఖిత పూర్వకంగా ఇవ్వగా సానుకూలంగా స్పందించారన్నారు. గతంలో డ్రైవర్‌కు రూ.5300 ఉండగా ప్రస్తుతం 6300, క్లినర్‌కు గతంలో 4100, ప్రస్తుతం రూ.4500 కు పెంచారని, రోజుకు బత్త డ్రైవర్‌కు రూ. 420, క్లీనర్‌కు రూ. 320 ఇవ్వడానికి అంగీకరించారన్నారు.

నేటి నుంచి మౌలాలి స్వామి ఉరుసు



విద్యుత్ దీపాల అలంకరణలో మౌలాలి స్వామి దర్గా

ప్యాపిలి: మండల పరిధిలోని పోతుదొడ్డి గ్రామంలో వెలసిన మౌలాలి స్వామి ఉరుసు ఉత్సవాలు నేటి నుంచి మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం గంధం, శుక్రవారం షంషీర్, శనివారం ఉరుసు ఉత్సవాలు ఉంటాయన్నారు. శనివారం తెల్లవారు జామున స్వామివారి పీరుకు గ్రామోత్సవం నిర్వహిస్తారు. అదేరోజు ఉదయం స్వామివారి గుర్రం కొండపైకి ఎక్కడంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

రిటైర్డ్ ప్రిన్సిపాల్ మృతి



జనార్దన్‌శెట్టి(ఫైల్)

కోవెలకుంట్ల: కోవెలకుంట్లకు చెందిన రిటైర్డ్ ప్రిన్సిపాల్ జనార్దన్‌శెట్టి(64) గురువారం మృతి చెందారు. అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృత్యువాడపడ్డారు. ఈయన హిస్టరీ లెక్చరర్, ప్రిన్సిపాల్‌గా కోవెలకుంట్ల, బనగానపల్లె, ఆళ్లగడ్డ పట్టణాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విధులు నిర్వహించారు. నాలుగేళ్ల క్రితం పదవీ విరమణ పొందిన ఆయన కొన్నేళ్ల పాటు రోటరీక్లబ్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా విధులు నిర్వర్తించారు. జనార్దన్‌శెట్టి మృతిపట్ల ఆర్యవైశ్య, ప్రజా సంఘాల నాయకులు సంతాపం తెలిపారు.

ఆటో బోల్తాపడి నలుగురికి గాయాలు

డోన్ రూరల్ : పట్టణంలోని ఈద్గామసీద్ వద్ద గురువారం ఆటో టైర్‌పగిలి బోల్తా పడడంతో నలుగురికి గాయాలు అయ్యాయి. బాధితులు వివరాల మేరకు... స్థానిక చిగురుమాన్‌పేటకు చెందిన వెంకన్న, గంగమ్మ, పిల్లలు నవీన్, వరలక్ష్మి ఆటోలో సినిమాకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు వారిని ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. గంగమ్మ, పిల్లలు నవీన్, వరలక్ష్మిలకు స్వల్ప గాయాలు అయ్యాయి. ఆటో డ్రైవర్ అయిన వెంకన్నకు తీవ్రగాయాలు అయ్యాయి. వైద్య పరీక్షలు చేసిన డాక్టర్లు పరిస్థితి విషమంగా ఉందని కర్నూలుకు రెఫర్ చేశారు.



డోన్ : కోర్టు ఆవరణలో జెండా ఆవిష్కరణ అనంతరం మాట్లాడుతున్న జడ్జి తంగమని



కోవెలకుంట్ల : జెండా ఆవిష్కరణ చేస్తున్న యార్డు చైర్మన్ కానాల కామేశ్వరమ్మ



కోవెలకుంట్ల : జెండాను ఆవిష్కరించిన తహసీల్దార్ పుష్పకుమారి

రెపరెపలాడిన ముువ్వన్నెల జెండా

గణతంత్ర వేడుకలు గురువారం డోన్, బనగానపల్లె నియోజకవర్గాల్లో ఘనంగా జరిగాయి. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యా సంస్థల్లో ముువ్వన్నెల జెండాలు రెపరెపలాడాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు త్రివర్ణ పతకాన్ని ఎగురవేసి గౌరవ వందనం సమర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమరుల త్యాగాలను గుర్తు చేశారు. స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలతో పాటు రాజ్యాంగం ప్రాముఖ్యతను అధికారులు, నాయకులు వివరించారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

– సాక్షి బృందం



బనగానపల్లె రూరల్: జాతీయ జెండాకు గౌరవ వందన చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



సంజామల: జెండా ఎగుర వేసిన సహకార సంఘం ఆవరణలో అధ్యక్షుడు గుండం సూర్యప్రకాష్‌రెడ్డి

రాజ్యాంగాన్ని గౌరవించాలి

బనగానపల్లెరూరల్: భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని, ఆ ప్రకారం నడుచుకోవాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ఈసారి యల్లమ్మ ఆధ్వర్యంలో గురువారం 74వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం ఆగస్టు 15న వచ్చిందని, జనవరి 26వతేది నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగం ప్రకారం పరిపాలన అమలుకావడం జరిగిందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.



డోన్: క్రిష్టియన్ జేఏసీ ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం



డోన్ రూరల్ : జెండావిష్కరణ చేస్తున్న మార్కెట్ యార్డు చైర్మన్ రాజానారాయణమూర్తి



అవుకు: రెవెన్యూ కార్యాలయ ఆవరణంలో జెండా వందనం చేస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు, అధికారులు



ప్యాపిలి: గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యుడు బోరెడ్డి శ్రీరామిరెడ్డి



బేతంచెర్ల : ఎంపీడీవో కార్యాలయంలో జెండా వందనం అనంతరం మాట్లాడుతున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి



బేతంచెర్ల : పోలీస్ స్టేషన్‌లో జెండా వందనం చేస్తున్న సీఐ ప్రియతం రెడ్డి, పోలీసులు



కొలిమిగుండ్ల : రామ్‌కోలో జెండా వందనం చేస్తున్న సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ రెడ్డి నాగరాజు



డోన్ రూరల్ : మండల పరిషత్ కార్యాలయంలో జెండావిష్కరణ చేస్తున్న ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి

ఆవోపా ఆధ్వర్యంలో వసంత పంచమి వేడుకలు



సరస్వతి మాతకు పూజలు చేస్తున్న దృశ్యం



చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

డోన్ టౌన్: సరస్వతిదేవి వసంత పంచమి పురస్కరించుకొని డోన్ ఆవోపా ఆధ్వర్యంలో స్థానిక అమ్మవారిశాలలో గురువారం సాయిత్రం అమ్మవారి చిత్ర పటానికి పూజలు నిర్వహించారు. పండితుడు శేషశర్మ స్వామి వేద మంత్ర ఉచ్చారణల మధ్య సరస్వతి మాతతో పాటు వాసవీ మాతకు ప్రత్యేక పూజలు చేశారు. ఉపాధ్యాయుడు, కవి సర్వజ్ఞ మూర్తి వసంత పంచమి ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం మాజీ అధక్షుడు దివంగత ఈర్లదిన్నె వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం అయన సతీమణి వసుమతి కుటుంబ సభ్యులు పది విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలకు అవసరమయ్యే మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఆవోపా అధ్యక్ష,కార్యదర్శులు క్రిష్ణకిషోర్,జోన్నలగడ్డ శ్రీనివాసులు, కోశాధికారి సుదర్శనరావు, ఉమ్మడి కర్నూలు జిల్లా ఆవోసా మాజీ అధ్యక్షులు తల్లం సత్యనారాయణశెట్టి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అక్షరాభ్యాసం

ప్యాపిలి: స్థానిక సరస్వతీ శిశు మందిరంలో గురువారం వసంతపంచమిని ఘనంగా నిర్వహించారు. సరస్వతీ మాత జయంతి సందర్భంగా పూజారి సతీష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం హెచ్ఎం రామాంజనేయులు ఆధ్వర్యంలో 54 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రబంధకారిణి సభ్యులు టీసీ విజయ్‌కుమార్, ఎల్సీ అనిమిరెడ్డి, దేవీ దయానంద్ సింగ్, ఉపాధ్యాయులు వాసు, శైలజ, పార్వతి, రవళి తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: సరస్వతీమాత జన్మదినం అయిన వసంత పంచమి వేడుకలను ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సరస్వతీ శిశుమందిరం ఉన్నత మాధ్యమిక పాఠశాలలో హెచ్ఎంలు రామ మద్దిలేటి విద్యార్థుల తల్లిదండ్రులచే హోమం నిర్వహించి సరస్వతీ మాతకు పూజలు నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసులు మంత్రోర్చనల మధ్య చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం

విస్తృతంగా సేవా కార్యక్రమాలు



నంద్యాల ఫ్రెండ్స్ జట్టుకు రూ. లక్ష మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లెరూరల్: తన పెద్ద కుమారుడు దివంగత కాటసాని నాగార్జునరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా భవిష్యత్తులో విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపడుతామని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానలో కాటసాని నాగార్జునరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత నెల 24వ తేదీన ప్రారంభమైన రాయలసీమ జోన్ లెవల్ గ్రేస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు గురువారం ముగిశాయి. హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో కాటసాని నాగార్జునరెడ్డి క్రికెట్ క్లబ్ టీంపై నంద్యాల ఫ్రెండ్స్–11 టీం విజయం సాధించింది. నంద్యాల్య ఫ్రెండ్స్–11 టీంకు ట్రస్ట్ తరుపున రూ.లక్ష, కాటసాని నాగార్జునరెడ్డి క్రికెట్ క్లబ్ టీంకు రూ.50 వేలతోపాటు కప్‌లను ఎమ్మెల్యే కాటసాని అందజేసి క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడాకారులకు సంపూర్ణ సహకారం అందజేస్తామని, క్రీడల అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానాన్ని తన సొంత నిధులతో అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని కుమారుడు కాటసాని ఓబులరెడ్డి, సోదరులు కాటసానిప్రసాదరెడ్డి, కాటసాని తిరుపాల్‌రెడ్డి, ఆర్గనైజర్లు శివ, సుదర్శన్ రెడ్డి, దుర్గా, అఖిల్, వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణారెడ్డి, సురేష్, రహిమాన్ పాల్గొన్నారు.

మూగ జీవాల ఆరోగ్యానికి భరోసా

- సంచార పశుఆరోగ్యసేవ అంబులెన్స్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే కాటసాని



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

కోవెలకుంట్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మూగజీవాల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తుందని, వాటి సంరక్షణకు వైఎస్ఆర్ సంచార పశు ఆరోగ్య సేవ పథకం ద్వారా పాడిరైతు ఇంటి ముంగిటకే నాణ్యమైన పశువైద్యం అందుబాటులోకి తెచ్చిందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. మండల కేంద్రం సంజామల సహకార సంఘం ఆవరణలో గురువారం ఆ పథకం ద్వారా కేటాయించిన అంబులెన్స్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మారుమూల పల్లెల్లోని పశువులకు సైతం మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం సంచార పశు ఆరోగ్య సేవ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలోని ఆయా నియోజకవర్గాలకు సంబంధించి మొదటి విడతలో రూ. 129.07 కోట్లతో నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 సంచార పశువైద్యశాలల అంబులెన్స్‌లు, రెండవ విడతలో రూ. 111.62 కోట్లతో 165 అంబులెన్స్‌లను అందుబాటులోకి తెచ్చిందని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో పశువులు వ్యాధిబారిన పడితే చికిత్సకు చాలా ఇబ్బందులు పడాల్సి పరిస్థితి అని, ఈ సమస్యలను గుర్తించిన ప్రభుత్వం సంచార పశు ఆరోగ్య సేవ పథకాన్ని అమల్లోకి తెచ్చిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి గుండం సూర్యప్రకాష్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు చిన్నబాబు, కోవెలకుంట్ల మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెండేకంటి కి రణ్‌కుమార్, పార్టీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రాంమోహన్‌రెడ్డి, అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పోచా వెంకట్రామిరెడ్డి, దేశాయ్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రహంతుల్లా, పశు సంవర్ధక శాఖ ఏడీ మోహన్‌రావు, ఎంపీడీఓ విజయ్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ మల్లికార్జునరావు, వ్యవసాయాధికారి సుధాకర్‌రెడ్డి పశువైద్యాధికారులు పద్మావతి, శివానంద, రఘుబాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

1962 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేస్తే చాలు..

గ్రామీణ ప్రాంతాల్లో మూగ జీవాలు అనారోగ్య బారిన పడితే 1962 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని ఎమ్మెల్యే కాటసాని సూచించారు. టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి రైతు పేరు, గ్రామం, మండలం, నియోజకవర్గం వివరాలు తెలియజేయాలన్నారు. ఈ సమాచారం వెంనే సంబంధిత రైతు భరోసా కేంద్రానికి చేరుతుందని, పశువైద్య సహాయకులు సంబంధిత ప్రాంతానికి వెళ్లి పశువులకు వైద్యసేవలందిస్తారన్నారు. అత్యవసర పరిస్థితుల్లో పశువైద్య నిపుణులు సంచార పశువైద్యశాల వాహనంలో వచ్చి పశువును పరిశీలించి వ్యాధి నిర్ధారణ జరిపి తగిన చికిత్స అందిస్తారన్నారు. అవసరమైతే పశువును హైడ్రాలిక్ లిఫ్టుసౌకర్యంతో అంబులెన్స్‌లోకి ఎక్కించి అందుబాటులో ఉన్న ప్రాంతీయ పశువైద్యశాలకు తరలించి పశువు ప్రాణాలు కాపాడుతారన్నారు. 1962 టోల్‌ఫ్రీ నంబర్ స్పందించని పక్షంలో సమీకృత కాల్‌సెంటర్ నెంబర్ 155251 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. మన నియోజకవర్గానికి రెండు అంబులెన్స్‌లు కేటాయించగా ఒకటి బనగానపల్లె, రెండవది సంజామల మండల కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఉంటాయన్నారు.

వాగులపై వంతెన ఏర్పాటుకు చర్యలు

- రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీ ప్రతినిధులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తాం
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

కోవెలకుంట్ల: సంజామల సమీపంలోని పాలేరు, గొండ్రవాగులపై వంతెన ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని, రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీ ప్రతినిధులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హామీ ఇచ్చారు. సంజామల రైల్వేస్టేషన్ నుంచి కొలిమిగుండ్ల మండలం రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీ వరకు యాజమాన్యం రైల్వే ట్రాక్ నిర్మిస్తున్న విషయం తెలిసిందే. వాగుల మీదుగా రైల్వేలైన్ ఏర్పాటు కావాల్సి ఉండటంతో సాగునీరు, ప్రయాణికులకు ట్రాఫిక్ కష్టాలు తలెత్తుతాయన్న రైతులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చిన నేపథ్యంలో గురువారం వాగులు, రైల్వేలైన్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని 250 మీటర్ల మేర వాగులపై వంతెన ఏర్పాటు చేసి వంతెన మీదుగా ట్రాక్ నిర్మించాలని ఫ్యాక్టరీ యాజమాన్యానికి సూచించారు. అలాగే సంజామల– గుళ్లదూర్తి ఆర్అండ్‌బీ రహదారిలో రైల్వే వంతెన సమీపంలో లో లెవల్ రోడ్డు ఉండటంతో చిన్నపాటి వర్షానికి నీరు నిల్వ చేరి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని రైతులు ఎమ్మెల్యేకు వివరించారు. లోలెవల్ రోడ్డు స్థానంలో తగినంత ఎత్తులో సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బీ డీఈ సునీల్‌రెడ్డిని ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి గుండం సూర్యప్రకాష్‌రెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెండేకంటి కిరణ్‌కుమార్, మండల ఉపాధ్యక్షుడు చిన్నబాబు, మైనర్ ఇరిగేషన్ డీఈ బాస్కరబాబు, ఏఈ నవజీవన్‌రెడ్డి, ఆర్అండ్‌బీ ఏఈ ఉసేని పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె–సిమెంట్ నగర్ గ్రామాల మధ్య ఘాట్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైనట్లు హైవే పెట్రోల్ సిబ్బంది గురువారం తెలిపారు. సిమెంట్ నగర్‌కు చెందిన రవి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎదరుగా వస్తున్న కారు ఢీకొంది. ప్రమాదంలో రవికి కాలు విరగడంతో 108 వాహనంలో కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మహానందిలో త్వరలో వడ్డెర్ల అన్నదానసత్ర భవనం

మహానంది: మహానంది దేవస్థానం ప్రాంగణంలో త్వరలో వడ్డె, వడియరాజుల నిత్యాన్నదాన సత్రం భవనం నిర్మిస్తామని మహానంది క్షేత్ర వడ్డె, వడియరాజుల అన్నసత్రం ముఖ్య సలహాదారుడు గోగుల హరి, గౌరవాధ్యక్షుడు కుంచపు పెద్ద వెంకటేశ్వర్లు తెలిపారు. మహానందిలో గురువారం అన్న సత్రం తరపున క్యాలెండర్లు ఆవిష్కరించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ అన్నసత్రం భవనం నిర్మాణం త్వరలో పూర్తి చేసి, మహానంది వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వేముల వెంకటస్వామి, గౌరవాధ్యక్షుడు పల్లె చిన్న వెంకటసుబ్బయ్య, ఉపాధ్యక్షుడు సంపంగి చిన్న సుబ్బరాయుడు, ఉపాధ్యక్షుడు గోగుల గోపాల్, ప్రధాన కార్యదర్శి గోగుల చిన్న నరసింహుడు, నంద్యాల జిల్లా వైస్ ప్రెసిడెంట్ చల్లా వెంకటేష్, వైఎస్సార్‌సీపీ నేతలు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.